# చంద్రహారం

సూర్యుడు ఉదయిస్తాడు. నీటి దొరువుల్లో కమలాలు వికసిస్తాయి. తమల పాకు తోటల నానుకొనివున్న మొగలిపొదలు సువాసనలు వెదజల్లు తాయి. గుంపులు గుంపులుగా జల పక్షులొక్కసారి పైకి లేస్తాయి - జాలరి వాళ్ళు గంగమ్మతల్లికి వందనంచేసి కొయ్యతెప్పలను నీళ్ళల్లోకి నెట్టుతూ వుంటారు- సముద్రం ఎంతో శ్రమతో పరుగెత్తుకుంటూవచ్చి చెలియలికట్టను తాకి విరిగి విరిగి పడిపోతుంది - ఇంతలోనే మళ్ళా కొత్త అల - కొత్త పరవడి - కొత్త ఉత్సాహం - ఈ కథ ఈనాటిది కాదు. చరిత్ర కందని కాలంనుంచీ యథాతథంగా అలాగే ఏమీ మార్పులేకుండా కొత్త పట్నంలో జరుగుతూనే వుంది!

చంద్రయ్య పంతులు ఓ వెదురుబెత్తం చేత్తో పట్టుకొని ఊపుతూ నడుస్తున్నాడు. సూర్యుడు పడమటి దిక్కుకు వంగాడు. అయినా ఇసుక ఇంకా చుర చుర మంటూనేవుంది. రెండు చేతులనిండా సీమసున్నం - మాసిన పంచెమీద నాలుగైదు చేతికుట్టు మాసికలు. రూపాయి వెడల్పున సిరా మరకపడ్డ ముతక ఖద్దరు చొక్కాజేబు. ఆ జేబులో ఓవైపు ఎర్ర రంగూ మరోవైపు పచ్చరంగూ వున్న పెన్సిలు. హరివిల్లులా వంగిన వెన్ను, అలల్లాగా, అల్లల్లాడుతున్న తెల్లని జుత్తు, దుబ్బుగా పెరిగిన తెల్లని మీసాలు - వంచె అంచుతో నుదుటి స్వేదబిందువులు అద్దుకొని వెళ్ళి తన మామూలు సింహాసనంపై కూర్చున్నాడు-

ఆ సింహాసనం ఈనాటిది కాదు.

గత నలభై అయిదు సంవత్సరాలుగా అలాగే అక్కడే అదే సమయంలో ప్రతిదినమూ కూర్చుంటున్నాడు. ఆ వూళ్ళో దానిపై కూర్చునే అధికారం మరెవ్వరికీ లేదు. అందుకే వూళ్ళోవాళ్ళంతా దానిని 'చంద్రయ్యగారి గద్దె' అంటారు.

చేతిలోని వెదురు బెత్తాన్ని చెట్టుకానించాడు, తన గద్దెపై దూళి నొకసారి ఛేత్తో తుడిచాడు. గద్దె ధూళి పోయిందో లేదో కాని చేతి చాకిపీసు పొడి మాత్రం

గద్దె కంటుకున్నది. చంద్రయ్య రాతి గద్దెపై కూర్చొని గొంతుకు బిగుతుగా వున్న ఖద్దరు చొక్కా గుండీలు సడలించి ఒకసారి నిట్టూర్చి ఊపిరితిత్తుల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

"పంతులుగారూ ఇదుగో" గ్లాసుతో కొబ్బరినీళ్ళ నందించాడు శేషు. చంద్రయ్య శేషువైపు ప్రేమగా చూచి గ్లాసెడు నీళ్లు గడగడ తాగేశాడు. అట్లు పోసుకునే సుబ్బమ్మ కొడుకు శేషు. తన విద్యార్థి శేషు. తండ్రి పుల్లయ్య కూడా తన శిష్యుడే. అతనికీ ఓనమాలూ ఒకటో ఎక్కమూ తానే దిద్దబెట్టాడు. చని పోయేవరకూ పుల్లయ్యది అట్ల వ్యాపారమే. చనిపోయేరోజు సాయంత్రం కూడా పుల్లయ్య మామూలుగానే కొబ్బరికాయలుకొట్టి నీళ్ల గ్లాసుకు పట్టివుంచి కొబ్బరి ముక్కలు పళ్ళెంలో పెట్టి, బోషాణం పెట్టెలో దాచి, పిండి మొత్తమూ ఒంటి చేత్తో రుబ్బి గిన్నెకెత్తి, చేతులుకడుక్కొని, సూర్యుడు పడమటికి తిరిగేవేళకు చంద్రయ్య పంతులు తన పాఠశాల ముగించి వేపచెట్టుకింది సింహాసనాన్ని అలంక రించగానే గ్లాసెడు కొబ్బరినీళ్ళు గురువుగారికి ఇచ్చాడు. కొబ్బరినీళ్లు తాగి సేద తీర్చుకొని 'పదికాలాలపాటు బతకరా పుల్లయ్యా' అని దీవించి 'అమ్మయ్య' అంటూ చెట్టు మొదటికి జారగిలపడ్డాడు చంద్రయ్య చల్లగాలి పీలుస్తూ, అయితే గురువుగారి ఆశీర్వాదం మాత్రం ఫలించకుండా ఆరోజు రాత్రే పుల్లయ్య పోయాడు. పుల్లయ్య పోయినందుకు చంద్రయ్య ఎంతగా మనస్సులో బాధ పడ్డాడో చెప్పడం అసాధ్యం. అలా నిశ్శబ్దంగా లోలోపలే కుమిలిపోయాడు. తన కళ్ళ ఎదుట పెరిగిన పుల్లయ్య చూస్తూండగానే పోయాడు. తానుమాత్రం అలా జీవితాన్ని లాగేస్తున్నాడు - ఏమిటీ విచిత్రం?? పుల్లయ్యపోయిన మర్నాడు బడికి శలవు ఇచ్చాడు చంద్రయ్య. పుల్లయ్య జాతీయ నాయకుడు కాడు. ప్రపంచ చరిత్రలో మహాయుద్ధాలు చేసి సువర్ణాధ్యాయాలు సృష్టించలేదు. కాకుంటే కొత్త పట్నం ప్రజలందరికీ నిద్రలేచి లేవకముందే కొబ్బరిపచ్చడి, అల్లంపచ్చడి రెండూ మాడుపాకులో పెట్టి, రెండు దోసెళ్ళ వెడల్పున వుండే అట్లు ఒక్కొక్కటి అర్ధ ణాకు ఇచ్చేవాడు. చంద్రయ్యగారి కుటుంబానికైతే అర్ధణాకు రెండు అట్లు. పుల్లయ్య పోయిన తరువాత ఓ నాలుగు రోజులవరకూ చంద్రయ్యకు మనస్సు మనస్సులో లేదు- అయిదోనాడు మామూలుగా బడి వదిలిపెట్టి బెత్తం చేత్తో పుచ్చుకొని తన వేపచెట్టు సింహాసనం దగ్గరికివచ్చి కూర్చునేసరికి 'పంతులు గారూ ఇదుగో' అన్న మాటలు విన్పించాయి మృదువుగా. తలపైకెత్తి

చూచాడు ఆశ్చర్యంగా. ఎదురుగా పుల్లయ్య కొడుకు శేషు వున్నాడు. చంద్రయ్యకు కళ్ళవెంట నీళ్లు వచ్చాయి- పుల్లయ్య పోయాడని పని వదిలితే భుక్తి గడిచేదెట్లా?? అందుకే పుల్లయ్య స్థానంలో సుబ్బమ్మ కూర్చున్నది- ఆమే పిండి రుబ్బింది. కొబ్బరికాయలు కొట్టింది. ముక్కలు వళ్ళానికెత్తి భోషాణంలో దాచింది. నీళ్లు గ్లాసుకుపట్టి కొడుకుద్వారా చంద్రయ్య పంతులుకు పంపింది. నాటినుంచీ నేటివరకూ ఇలా శేషు దినం తప్పకుండా కొబ్బరినీళ్లు ఇస్తూనే వున్నాడు. చంద్రయ్య పంతులు తాగి సేద తీర్చుకుంటూనే వున్నాడు... ....

ఈనాడు కూడా చంద్రయ్య శేషు చేతిలోని గ్లాసు తీసుకొని గడగడ నీళ్లు తాగేశాడు. ఓ చుక్క చేతిమీద ఒలికింది పైన వున్న మాసిన కండువాతో చేతిపై అద్దుకొని గ్లాసును శేషుకు తిరిగి ఇవ్వగానే తుర్రున పరుగెత్తుకుంటూ పోయాడు శేషు ఇంట్లోకి - చంద్రయ్య గట్టిగా నిట్టూర్చి వేపచెట్టు కాను కున్నాడు. దూరంగా సముద్రం. భూమ్యాకాశాలు ఒకే నీలమేఘచ్ఛాయతో కలిసిపోయాయి అక్కడ. గంభీరమైన ఆ సాగరంలో తరంగాలు ఉవ్వెత్తున లేచి విరిగిపడుతున్నాయి చంద్రయ్యకు కొడుకు కూతురూ గుర్తుకొచ్చారు. గుండె బాగా బరువెక్కింది. 'రేపు తెనాలిలో వున్న బంధువొకరికి జాబు వ్రాయాలి మళ్ళీ పిల్ల సంబంధంగూర్చి' అనుకున్నాడు. ఖాళీ చేపలబుట్టలతో జాలరి వనితలు ఇంటిముఖం పట్టారు. 'చందూగాణ్ణి రేపు ఫస్టుబస్సుకు ఒంగోలు పంపాలి' అనుకున్నాడు మళ్ళీ. అక్కడొక తెలిసినాయన చందూకు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తానని మాట ఇచ్చాడు.

'దండాలు పంతులూ దండాలూ' మహాలక్ష్మి మల్లెపువ్వల్లాగా గుడ్డలను దొరువుల్లో ఉతికి ఆరేసి మడతలు పెట్టుకొని వెళ్లుతూవుంది త్రోవన.

'ఏయ్ - ఇవ్వాళ మీ బుడ్డోడు రాలేదు' చంద్రయ్య పంతులు తీగెల కళ్ళజోడు తీసి పై పంచెతో తుడుచుకుంటూ అడిగాడు. కిసుక్కున నవ్వింది మహాలక్ష్మి. 'వాడి చదువే అడిగావ్ పంతులూ - ఓ పూటొస్తే రెండుపూటలు సర్వే తోటల్లో ఆడుతున్నాడు. నీ బెత్తానికి పనిసెప్పందే లాబంలేదు పంతులూ.' ఒయ్యారం ఒలకపోస్తూ తాపీగా జవాబుచెప్పింది మహాలక్ష్మి.

చంద్రయ్య ఎడమచేతి బొటనవ్రేలూ చూపుడువ్రేళ్ళతో ఒక్కసారి కణతలనుండి కొలుకులవరకు కళ్ళను రుద్దుకొని, రెప్పలు పెద్దవిచేసి 'ఇదిగో చూడూ వాడు బాగా తెలివైన ఘటం. ఇంటిదగ్గర మీరు మొగుడూ పెళ్ళాలు శ్రద్ధ తీసుకోకపోతే ఏమీ లాభంలేదు. ఇటు అక్షరంముక్కా అబ్బక అటు రేవుకూ పనికిరాక నిజంగా రెండింటికీ చెడిన రేవడు అవుతాడు '

'ఔ' నన్నట్లు తల ఆడించింది మహలక్ష్మి శ్రద్ధగా వింటూ. "పెద్దోడు బుద్ధిమంతుకు పంతులూ" ఈడికే వచ్చింది రోగం చదువంటే."

'సరేలే పో-పో- చీకటి పడుతున్నది.'

'చిత్తం -' అని మహలక్ష్మి ఓ పది గజాలు పోయి మళ్ళీ వెనక్కు వచ్చి 'పంతులూ మొన్న ఆడి పెనసలు ముక్క రంగయ్యగారి గుంటడు కాజేసినాదంట - కొంచెం వాడి చెవులు మెలెయ్యాలి పంతులూ' అన్నది మూతిటివ్వుతూ.

'ఊఁ - ఊఁ' అన్నాడు చంద్రయ్య - మహలక్ష్మి మళ్ళీ నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

చంద్రయ్య తమలపాకు తోటలమీదుగా వస్తున్న మొగలిపూల గాలిని గట్టిగా రెండు వూపిరితిత్తులనిండా పీల్చుకున్నాడు. ఆ వూపిరితిత్తులు పగలల్లా కొలిమితిత్తుల్లాగా పనిచేసి సూర్యుడితో పాటు విశ్రాంతి తీసుకుంటుంటాయి. మళ్ళీ సూర్యోదయంతో పని ప్రారంభిస్తుంటాయి.

తల పైకెత్తి చూచాడు -

ఎదురుగా, దూరంగా, శిథిలమైన లైటుహవుస్ స్తంభం !

ఈ లైట్‌హౌస్ గూర్చి పరిశోధన చెయ్యాలని చాలా నాళ్ళనుంచీ చంద్రయ్య మనస్సులో ఓ కోరిక మిగిలిపోయింది. కాని దురదృష్టవశాత్తు కొత్తవట్నంలో వున్న మహావిద్వాంసుడల్లా తానొక్కడే. మరెవ్వరికీ రాజవంశావళీ, అక్కడి నౌకా వ్యాపారం జరిగిన కాలమూచరిత్ర పుటలలోనుంచి బయటకు లాగే శక్తిలేదు - ఆసక్తిలేదు. అందుకే తన కోరిక ప్రతిరోజూ ఉవ్వెత్తుగా పైకి లేచివచ్చి ఒడ్డును తాకి తిరిగిపోతున్నది . మొన్న ఉదయం అమ్మాయి ఆటకపై

నుండి గుడ్డలమూట తీసి 'నాన్నా ! చూడు ఈ తాటాకుల పుస్తకానికి చెదలుపట్టి నట్లున్నది' అన్నది దులుపుతూ. చంద్రయ్య ఆదుర్దాగా పరిశీలించి చూచాడు. నిజమే ! తన తండ్రి వ్రాసిన రామలింగేశ్వర శతకం చెదలుపడుతున్నది. ప్రాణం విలవిలలాడింది. భూతద్దం ఒకటి ఒంగోలునుంచీ తెప్పించి దాన్నంతా కాగితాలపై తిరిగివ్రాసి వీలున్నప్పుడు అచ్చువేయించాలని చంద్రయ్య సంకల్పం. కానీ ఎప్పటికప్పుడు ఆర్థికమైన ఇబ్బందులవల్ల భూతద్దం కొనడమే పడటం లేదు - ఇక అచ్చుమాట చెప్పేదేమిటి -

ఈ లైటుహవుసుపై పరిశోధన కూడా అలాంటిదే........

నిట్టూర్చాడు చంద్రయ్య.

ఆకు తోటల నుండి రైతులు అరిటాకుల కట్టలు నెత్తిన బెట్టుకొని వరుసగా వస్తున్నారు - ఉదయం ఫస్టు బస్సుకు ఇవన్నీ ఒంగోలు చేరుతాయి పెరుగు ముంతలతో సహా. పూర్వమైతే అన్నీ వూళ్ళోనే పందారమైపోయేవి - ఇప్పుడిప్పుడీ వ్యాపారం మరిగారు రైతులు.

సుబ్బమ్మ చిన్న కోడిగుడ్డు దీపం వెలిగించి గోడకు తగిలించింది. ముద్దపులి బొంగరాల బుట్ట నెత్తిని పెట్టుకొని శేషు వూళ్ళోకి బయలుదేరాడు అమ్మటానికి. అంటే చంద్రయ్య గద్దెమీది నుంచీ లేచే సమయమన్నమాట - చిన్నప్పుడు ముద్దపులి బొంగరాలంటే తనకు చాలా ఇష్టం. పుల్లటి మజ్జిగలో పిండి నానబెట్టి పచ్చి శనగపప్పు, పచ్చిమిర్చి, ఉల్లిపాయలూ కరివేపాకు కలిపి, దోరగా గుండ్రంగా వేయించిన ఆ ముద్దపులి బొంగరాలంటే ప్రాణం - అయితే తండ్రి తిననిచ్చేవాడుకాడు. 'కోమటింటి నూనె వస్తువులు కొనుక్కొని తిన కూడద'ని నిషేధం విధించాడు - అదేమిటో చందూగాడికి కూడా తనలాంటి ఇష్టమే - అయితే చందూగాడిపైన తాను నిషేధం విధించలేదు - అప్పుడప్పుడూ చందూ, శేషును పిలిచి బొంగరాలు కొనుక్కొని తింటుంటాడు. తానుమాత్రం పెద్దతనానికి వూరికే మందలిస్తూ వుంటాడు - అంతే ! !

చీకటి బాగా వ్యాపించింది.

చంద్రయ్య ఇంటి ముఖం పట్టాడు. ఇంతలో చటుక్కున జ్ఞాపకం వచ్చింది, ప్రసూన 'సాంతం ఆ రామయ్యకు చెప్పండీ గ్యాస్‌నూనె అయి

పోయింది పొద్దునే పంపించమనీ' అని చెప్పిన మాట - వెంటనే చంద్రయ్య రామయ్య కిరోసిన్ దుకాణం వైపు తిరిగి నడక సాగించాడు. ఆకు తోటలనుంచీ గుంపుగా కొంగలు వచ్చి వేపచెట్లపై వాలాయి. 'కొకొక్కో' మంటూ - మెత్తని ఇసుకలో మెల్లగా నడుచుకుంటూ రామయ్య దుకాణం చేరాడు చంద్రయ్య బెత్తంతో నేలను పొడుస్తూ

'రామయ్యా....'

'ఎవరూ - పంతులా - రా పంతులూ' ఆహ్వానించాడు రామయ్య హరికేన్ లాంతరు కొంచెం పెద్దది చేసి. చొక్కా లేకుండా లాంతరు ముందు కూర్చొని జమావద్దుల పుస్తకం చూచుకుంటున్నాడు రామయ్య మధ్య మధ్య ఎడమచేతితో జంధ్యాన్ని అటూ ఇటూ లాగి వీపు గోక్కుంటూ. కొంచెం దూరంగా రామయ్య కొడుకు కిష్టయ్య కూర్చొని అక్షరాలు దిద్దుకొంటున్నాడు. పంతులు పేరు వినగానే పలకా బలపమూ లాంతరు దగ్గరే వదిలి లోపలికి పరిగెత్తాడు కిష్టయ్య 'చూడు - గ్యాస్‌నూనె అయిపోయిందట... అమ్మగారు ఉదయం పంపమని చెప్పింది -' మెల్లగా అన్నాడు చంద్రయ్య.

'అట్టాగే పంతులూ పొద్దున్నే పంపుతా....అన్నట్లు పాత ఎకౌంటులో నీ పేర కొద్దిగా మిగిలినట్లు కన్పడుతున్నది'

చంద్రయ్య గుండె కలుక్కుమన్నది.

'అయినా నీ దగ్గర ఎక్కడికి పోతుందిలే పంతులూ. వూరికే పుస్తకం చూస్తుంటే కనపడిందని చెప్పా - అమ్మగారితో పొద్దున్నే పంపుతానని చెప్పు పంతులూ నూనె....' చంద్రయ్య ఇంటి ముఖం పట్టాడు ఆలోచిస్తూ - ఈ రామయ్య కూడా పుల్లయ్యతో బాటు తన దగ్గర చదువుకున్న తొలి దినాల విద్యార్థుల్లో ఒకడే - రామయ్య బడికి రావడానికి మారాము చేసేవాడు. వాళ్ళయ్య నలుగురు మనుషుల్ని బెట్టి మోయించి తెచ్చేవాడు రామయ్యను బడికి. ఒంటికనో మంచినీళ్ళకనో వంకబెట్టి బయటకు పోయేవాడు రామయ్య. అంతే!! అదే పోత ఇంక - అందుకే రామయ్య కెప్పుడూ గోడకుర్చీలే - ముంతపొగపెడ్తానని బెదిరించడమే - తన కళ్ళ ఎదుట పెరిగి పెద్దవాడైనాడు రామయ్య. పెళ్ళి చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు. తండ్రి ఇచ్చిన పూరిల్లును పెంకుటిల్లుగా మార్చాడు. గ్యాసునూనె వ్యాపారం చేసుకుంటూ వున్నాడు శ్రద్ధగా.

కాలికేదో తగిలింది.

తొట్రుపడ్డాడు చంద్రయ్య - ఏమీలేదు చీల్చిన తాటిమట్టను ఎవరో దారి కడ్డంగా పడేశారు. మరో నాలుగు అడుగుల్లో ఇంటికి చేరుకున్నాడు చంద్రయ్య. ఆరు బయటే వున్న నులక మంచంలో కూలబడ్డాడు. అమ్మాయి రాధిక వచ్చి బెత్తమూ, చొక్కా లోపలికి తీసుకుపోయింది. దిండుకానుకొని, మళ్ళీ లోనికి వెళ్ళిన రాధికను చూచి మళ్ళీ అనుకున్నాడు. 'అమ్మాయి కిక పెళ్ళిచేయాలి....'

చంద్రయ్యకు తన పెళ్ళి గుర్తుకొచ్చింది. తనకు ప్రసూనతో చాలా చిన్న వయస్సులోనే పెళ్ళయింది. పెళ్ళంటే ఏమిటో కూడా తెలియని వయస్సు. కేవలం లడ్డూలు తినడం, పల్లకీలో ఊరేగడం మాత్రం గుర్తున్నాయి. అయినా సరే ప్రసూన వయస్సుతో బాటు వికసిస్తూ తన ఇంటిని పరిమళాలతో నింపి తన జీవితంలో జీవితంగా కలిసిపోయింది. ఎన్నడూ తనకిది కావాలీ అది కావాలీ అని అడిగి ఎరుగదు. ఒక రోజు కాబోలు అన్నది :

"అబ్బ చంద్రుడు పుచ్చపువ్వులా వెలుగుతున్నాడేమిటీవేళ......" చంద్రయ్య నవ్వి "ఔనే - భర్త పేరు చెప్పడం నీ వంటి పతివ్రతల ధర్మం కాదేమో"

ప్రసూన కొంచెం సిగ్గుపడి "బాగుంది మీ సరసం మరీను, ఇన్నేళ్ళు వచ్చినా....ఏమండీ అన్నట్లు మీకో విషయం చెప్పడం మరచిపోయాను సుమా" అన్నది అరటికాయ ముక్కలు నీళ్ళ గిన్నెలో పడేస్తూ -

"ఏమిటది?" పరధ్యానంగా అన్నాడు దీపం ముందు కూర్చొని ఏదో పుస్తకం పుటలు తిప్పుతూ.

"మా సీతాలత్త లేదూ, అదేనండీ సూరారెడ్డిపాలెం వాళ్ళు...."

"ఆఁ - ఆఁ..."

"వాళ్ళ పెద్దమ్మాయి గుర్తుందా మీకు - దుర్గ -"

"ఆఁ -"

"దానికి పెళ్ళి నిశ్చయమయిందట... "

"ఊహూఁ -"

"కట్నాలూ కానుకలూ కూడా నిశ్చయించుకొని తాంబూలాలు పుచ్చుకున్నారట...."

ఊహూఁ -"

"దానికి సీతాలత్త వాళ్ళు చంద్రహారం పెడుతున్నారట... 'చంద్రహారం' అనే సరికి చంద్రయ్య తలెత్తి చూచాడు. లోగడ ఎప్పుడో ఒకసారి తనతో ప్రసూన ఒంటరిగా వున్నప్పుడు చంద్రహారంగూర్చి ప్రసక్తి చేసినట్లు జ్ఞాపకం.... మళ్ళీ ఇవ్వాళ .. చంద్రయ్య నిట్టూర్చాడు, ఏదో కృతనిశ్చయానికి వచ్చాడు. తరువాత ఓ రెండు నెలలకు పనిమీద ఒంగోలు పోయినప్పుడు బందరు కంపెనీ వారి ఓ గోల్డు కవరింగ్ చంద్రహారం కొని తెచ్చి ప్రసూన కిచ్చాడు.

ఇస్తుంటే కొంచెం చెయ్యి వణికింది తనకు.

"ఎందుకండీ ఇది - ఎవరు తెమ్మన్నారు మిమ్మల్ని ?" అని మాత్రం అన్నది ప్రసూన. అంతే ! ఇంకేమీ వ్యాఖ్యానించలేదు. చంద్రయ్య అనుకున్నాడు" ఆ "రోజున కనీసం నా పాప రాధిక పెరిగి పెద్దదయ్యేనాటికన్నా నేను దానికి చంద్రహారం చేయించి ఇవ్వాలి" అని,

రాధిక పెద్దదయింది - పెళ్ళీడుకు వచ్చింది -

కాని తానైతే చంద్రహారం చేయించే స్థితిలో వున్నాడా ??....

నవ్వుకున్నాడు చంద్రయ్య.

"ఆ రోల్డుగోల్డు యుగపు రోజులే బాగున్నాయి నేటికంటే" అనుకున్నాడు -

"పంతులూ" చంద్రయ్య ఆలోచనా ప్రవాహానికి ఏదో అంతరాయం, చూచాడు - సామిగాడు వచ్చాడు.

"ఏరా సాములూ ..."

"పంతులూ - చంటిదెందుకో ఒకటే గిరికలు తిరిగిపోతున్నది - కూడు ముట్టడంలేదు ..."

'ఊం -" అని ఒక్క క్షణం ఆగి 'అమ్మాయ్ - ఆ పచ్చ సీసాలో మాత్రలు రెండు కట్టి ఇలా ఇయ్యమ్మా' అని ఓ పొడిదగ్గు దగ్గి "చూడు సాములూ పొద్దున్నే నేను బడికి పోయేలోపలే చంటిదాన్నొక్కసారి తీసుకురా. చూద్దాము, ఈ రెండు మాత్రలూ రాత్రి కెలాగైనా కడుపులోకి పోయేటట్లు చూడు - ఏమీ భయంలేదులే.'

"ఏమో అంతా నీ దయ పంతులూ" సాములు రెండు చేతులతోనూ మొక్కి మాత్రలు తీసుకొని వెళ్ళిపోయాడు.

'అమ్మాయ్ - మీ నాన్నగారిని మడికట్టుకోమని చెప్పు ..."

ఇంట్లోనుండి ప్రసూన కేక.

ఇవ్వాళెందుకో మంచ మీదినుండి లేవ బుద్ధిపుట్టలేదు .

అయినా సరే బలవంతంగా లేచి కూర్చున్నాడు.

మడికట్టుకొని పీటపై కూర్చొని ఓ అయిదు నిమిషాలు, గొణ గొణ మన్నాడు. పారాయణ పూర్తి కాగానే 'ఆ, వడ్డించు అంటూ'

'ఏరా చందూ....' అని కేక వేశాడు.

'ఊం -' వాకిట్లో మట్టి అరుగుమీద చిరుచాపపై పడుకొని వున్నాడు చందూ....

'రేపు ఒంగోలు పోతావేమిటి....'

చందూ ఔననలేదు. కాదనలేదు.

ప్రసూన వండిన గోధుమనూకను విస్తట్లోకి వడ్డించింది. చంద్రయ్య ఓ రెండు ముద్దలు తిని అన్నాడు. 'తూర్పుపాలెం శివాలయం దగ్గరే బస్సు దిగు-స్టాండ్ దాకా వెళ్ళకు....'

'ఊం- -'

'ఒకవేళ రైల్వేగేటు వేసివుంటే దిగి నడుచుకుంటూ తూర్పుపాలెం చేరు'....

'ఊఁ.'

'అక్కడ రామకోటిని కలుసుకో - అదేరా, పెద్దరెడ్డిగారబ్బాయి రామకోటయ్య గుర్తులేదూ - నీవు ఒకటో క్లాసులో వున్నప్పుడు 'పంతులుగారూ పంతులుగారూ' అంటూ మనింటికి వస్తూండేవాడు ..."

'ఊఁ.'

'వాడు మన శిష్యుడే. వెళ్ళు ఏం.'

చందూ ఏమీ అనలేదు.

చంద్రయ్య లేచాడు 'అమృతమస్తు' అంటూ.

'అదేమిటి అంతా అలాగే వదిలేశారు... ' అన్నది ప్రసూన అదుర్దాగా.

చంద్రయ్య బలహీనంగా నవ్వి దొడ్డి గుమ్మందగ్గర చెయ్యి కడుక్కున్నాడు లోటా కింద పెట్టి మళ్ళీ వాకిట్లోకి వచ్చేసరికి రాధిక తనకై పక్క వేసి వుంచింది - చంద్రయ్య మంచంపై చేరగిల పడ్డాడు. ఆకాశాన్ని చూస్తూ ఒక్కొక్క చుక్కనే లెక్కపెట్టాలని ప్రయత్నిస్తున్నాడు, కాని చూపుకు వెనకటి ఊపు లేకపోవడంతో తానే ఓడిపోయాడు. భోజనాలైనాక ప్రసూనా రాధికా పక్కింటివాళ్ళతో కలిసి గుళ్ళో హరికథ వుందంటే వెళ్ళారు. చందూ నిద్రపోయాడు. ప్రకృతి మొత్తం నిద్రపోతున్నది. ఆకు అల్లల్లాడటం లేదు - కాని నిద్రపోనిదల్లా ఇద్దరే - ఒకటి సముద్రం - రెండవది చంద్రయ్య. ఆయన కళ్ళముందు ఏవేవో వర్ణదృశ్యాలు... వీధిలో ఒంటరిగా పడుకున్న కుక్క ఒకటి కలలో మొరిగినట్లు మొరుగుతున్నది - గుడిలోనుండి హరికథా కీర్తనం - దూరాన ఎక్కడో పల్లెవాళ్ళ కేక - 'హో హ్హో హో'....

చంద్రయ్యకు మగతనిద్ర పట్టినట్లనిపించింది....

గలగలా మనుషుల శబ్దం ...'ఎవరూ ...'

'మేము గుడినుండీ వస్తున్నాము-పడుకోండి' ప్రసూన కంఠం-'ఎంతైందే టైము?'

'ఆ, ఒంటిగంట కావొస్తున్నదండీ ... మంచినీళ్ళు ఇమ్మంటారేమిటి?....'

'అక్కర్లేదులే.' చంద్రయ్య ఇటువైపుకు పొర్లి పడుకున్నాడు మళ్ళీ-అయితే ఇక నిద్ర పట్టలేదు.

చంద్రయ్య మనస్సు ఎందుకో వేదాంతంవైపుకు తిరిగింది-

మనుష్యుడు గొప్పవాడని అంటారు-కాని అతని శక్తులన్నీ పరిమితాలే కదా! ఆకలిని జయించలేడు. నిద్ర అతని జీవితంలో సగభాగం మింగివేస్తున్నది. ఇక మృత్యువు సరేసరి - మానవుడు మృత్యుంజయుడు కాగలడా?? ఎలా?? ఎప్పుడు?? ఆలోచన ఇక ముగియలేదు-

'కొక్కొరోకో' తొలి కోడి కూసింది.

దూరంగా జాలరివాళ్ళ శబ్దం-

ప్రభాత పవనాలు మొగలిపొదల మీదినుండి వస్తున్నాయి. తమలపాకుల తోటల మీదుగా వేగుచుక్క మెరుస్తున్నది. 'ఏరా-చందూ-లే' కేక వేశాడు చంద్రయ్య. రెండు మూడుసార్లు పిలిస్తేనే కాని చందూ లేవలేదు-చాలా అయిష్టంగా లేచి కళ్ళు నులుముకుంటూ అలాగే పక్కపై కూర్చున్నాడు 'లే-లే-ఫస్టు బస్సు వేళ అవుతున్నది-' చంద్రయ్య నులకమంచంమీద పడుకొనే కేక పెట్టాడు.

చందూ లేచి కాలకృత్యాలు నిర్వహించుకొని గుడ్డలు వేసుకున్నాడు-ప్రసూనమ్మ లేచి దీపంబుడ్డి ఇంకొంచెం పెద్దదిచేసి పాత భోషాణంనుండి తీసిన పాలగిన్నెను పరీక్షించి చూచింది. ఆలస్యంగా తోడు వేయడంవల్లనేమో బాగా తోడుకోలేదు పాలు - వెయ్యనా? వద్దా? అని సంశయిస్తూ రాత్రి వండిన అన్నమూ, గోధుమరవ్వతో చేసిన పిండీ రెండూ పెట్టింది కంచంలో....

'అమ్మా ఆవకాయ వెయ్యి' ప్రసూనమ్మ జాడీలోంచి ఓ గరిటెలోకి ఆవకాయ తీసి ఓ బద్దవేసి శనగగింజలతోవున్న కాస్త కారంవేసి నూనె వంచింది-

చందూ మాట్లాడకుండా తింటున్నాడు.

రాధిక తల్లిదగ్గరికి వచ్చింది నిద్రలేచి. 'అన్నయ్య అప్పుడే అన్నం తింటున్నాడే....' అంటూ కాళ్ళు జాపుకొని కూర్చుందొక పీటమీద.

'ఒంగోలునుంచి ఏం తెస్తావురా అన్నయ్యా.'

చందూ తల పైకెత్తి ఓసారి చూచి మళ్ళీ తలవంచుకొని ఆవకాయ కడి మరొకటి నోట్లో పెట్టుకొని 'అం- మజ్జిగ పొయ్యి' అన్నాడు.

ప్రసూనమ్మ తోడుకొని తోడుకొనకుండా వున్న పాలను పోసింది కంచంలో. ఉప్పుడు రవ్వను అందులో పిసుక్కొని గడగడ తాగేశాడు చందూ.

'పాం- పపాం-' కారు హారన్ - చంద్రయ్య మంచంమీదినుండి లేచి 'అదుగో ఫస్టుబస్సు హారన్ ఇస్తున్నది వెళ్లు త్వరగా.... 'చందూ గబగబా లేచి చెయ్యి కడుక్కొని తల్లి కాళ్ళకు దణ్ణంపెట్టి సంచీ చేతబట్టుకొని పరుగెత్తాడు బస్సువైపు- వీధిలోదాకా వచ్చారు ప్రసూనా, రాధికా చందూ గుడివైపుగా బస్సు దిగివున్న చెట్టువైపుకు మలుపు తిరిగాడు.

అరిటాకులూ, ఈచా, గెలలూ, పెరుగుదుత్తలూ రైతులు బస్సుదగ్గరికి చేరవేస్తున్నారు-

చంద్రయ్య దూరంగా అకుతోటల వైపుకు నడక సాగించాడు. నక్షత్రాలు వెలుగును కోల్పోతున్నాయి క్రమంగా....

మళ్ళీ సూర్యోదయం-

చంద్రయ్యా పంతులు బెత్తంతో పాఠశాలకు వెళ్ళాడు. అటెండెన్సు రిజిష్టరు - చాక్‌పీసు - డస్టరు - పిల్లల అరుపులు - ఏడుపులు - సాడీలు చెప్పుకోవడాలు - బెత్తానికి పని కల్పించడం - నిన్న రానివాణ్ణి గోడకుర్చీ వేయించడం- అంతా మామూలే-

కాని చంద్రయ్య హృదయం మాత్రం మామూలుగా లేదు-

పొద్దుతిరుగుడు పువ్వులా సూర్యునివెంట తిరుగుతున్నది. సాయంత్రమైంది—

చంద్రయ్య పంతులు బెత్తంతో బయటపడ్డాడు. సింహాసనం వైపుకు నడిచాడు.

చేత్తో రాతిని సిద్ధంచేసి వేపచెట్టుకింద కూర్చున్నాడు.

'పంతులూ ఇదుగో.' శేషు కొబ్బరినీళ్ళు ఇచ్చాడు.

సుబ్బమ్మ ముద్ద పులిబొంగరాలు పోస్తున్నది....

చంద్రయ్య, కళ్ళజోడు ముక్కు కొనకు లాగి దూరంనుంచి వస్తున్న వ్యక్తిని చూస్తూ అన్నాడు 'ఎవరూ ..'

'నేనే' చందూ ముక్తసరిగా జవాబుచెప్పి అటువైపు సాగిపోతున్నాడు.

చంద్రయ్య రోజుకన్నా పెందలాడే తన సింహాసనం మీదినుండి లేచాడు. ఇంటిముఖం పట్టాడు. గుమ్మంలోకి వెళ్ళకముందే ప్రసూనమ్మతో చందూ అన్న మాటలు వినిపిస్తున్నాయి 'అంతా - మన బంధువులే - మన శిష్యులే - ఆ రామయ్య దగ్గరికి పోతే సరిగా వలకరించనేలేదు సరికదా 'ప్రతివాళ్ళకూ ఈ రికమండేషన్లు మెండైనాయి ఈ రోజుల్లో' అని పక్కనే చీట్లాటకు కూర్చున్న స్నేహితుడితో అంటున్నాడు - శిష్యట్ట - శిష్యుడు - నాన్నదగ్గర ఈయన నేర్చుకున్న చదువు కాబోలు.'

చంద్రయ్య మాట్లాడకుండా నులకమంచంపై కూలబడ్డాడు. రాధిక తండ్రిని చూచి గబగబా వచ్చి దిండు తలకింద పెట్టబోయింది - 'మంచినీళ్ళు తెస్తానుండు నాన్నా....'

'చూడు రాధా! చందూచేత ఓ గ్లాసు నీళ్ల పంపు....'

అయోమయంగా చూచింది రాధిక.

జల పక్షులు తిరిగి వేపచెట్లపైకి చేరుతున్నాయి.

సూర్యుని రథం పడమటి కొండల్లో దిగిపోయింది.

చీకటి సన్నగా, చంద్రయ్య ఆవేదనలా, దిక్కులన్నీ వ్యాపిస్తున్నది - చంద్రయ్య ఆకాశంవైపుకు చూచాడు.

చంద్రహారంలో వెలిగే ముత్యాల పంక్తిలా బారు కట్టి పోతున్న కొంగలు.—

చంద్రయ్య, కొడుకు ఉద్యోగస్థుడన్న మాట వినాలని ఎదురుచూచా డింత వరకూ.... కాని అదింకా రేపటి దూరంలో వుంది. వర్తమానానికీ, ఆ దూరానికీ మధ్య ఒక చీకటి రాత్రి ...

'ఏమండీ ఇవ్వాళ పిండి వండమంటారా ... లేక.' ప్రసూనమ్మ వాకిట్లోకి వచ్చి భర్త స్థితి చూచి కొయ్యబారిపోయింది. జ్ఞానదాత సూర్యుణ్ణి మింగివేశా నన్న అహంకారంతో అవిద్యారూపమైన చీకటి అలా తెల్లవార్లూ కుండపోతగా కురుస్తూనేవుంది.

*                *                *

కాల ప్రవాహంలో అయిదేళ్ళు గడిచాయి

దేశంలో మరొక పంచవర్ష ప్రణాళిక ఫలితంగా అనేకమైన మార్పులూ జరిగాయి.

అయితే కొత్తపట్నం మాత్రం వాల్డన్ వద్ద కూర్చున్న థోరోలాగా సబర్మతిలోని గాంధీలాగా నవ నాగరికతకు దూరంగానే వుండిపోయింది.

అదే సూర్యోదయం. నీటి దొరువుల్లో అవే కమలాలు తమలపాకుల తోటల నానుకున్న మొగలి పొదలనుండి అవే సువాసనలు.

జాలరివాళ్లు గంగమ్మతల్లికి వందనంచేసి అలాగే కొయ్య తెప్పలను నీళ్ళల్లోకి నెట్టడం....

ప్రసూనమ్మ కూతురికి పెళ్ళిచేసి పంపించేసింది.

ఇంటికొక కోడలిని తెచ్చుకుంది.

సుబ్బమ్మ స్థానం శేషు ఆక్రమించాడు.

మహలక్ష్మి కొడుక్కు పట్నంలో కేంద్రప్రభుత్వపు ఉద్యోగమొస్తే గుడ్డ లుతకడం మానేసి బస్తీకి పోయింది....

ఇంతకు మించి చెప్పుకోదగ్గ మార్పులేవీ జరగలేదు వూళ్ళో...

మామూలుగానే ఆనాడు కూడా సాయంకాలం క్రమంగా రాత్రి క్రిందికి పరిణామం చెందుతున్నది.

బెత్తం చేత్తో పట్టుకొని చాక్‌పీస్ అంటిన చేతిని తుడుచుకుంటూ చందూ తండ్రిగారి సింహాసనం వైపుకు నడిచాడు -

బెత్తాన్ని చెట్టు మొదటికి ఆనించి రాతిని చేత్తో తుడిచాడు. చేతి చాక్‌పీసు దాని కంటుకున్నది -

కొలిమి తిత్తుల్లా పగలంతా పనిచేసిన ఊపిరితిత్తుల నిండా తమలపాకుల తోటలనుండి వచ్చే గాలిని నింపుకుంటూ తల పైకెత్తి దిగంతాలలోకి చూచాడు.

దూరంగా ఎత్తుగా శిథిలమైన లైటుహవుస్.

'పంతులూ ఇయిగో నీళ్లు' శేషు చందూకు కొబ్బరినీళ్ళు అందించాడు.

"శేషూ! ఓ అణా ముద్ద పులిబొంగరాలు కూడా పట్రా"-

దూరంగా రెడ్డిగారింట్లో బ్యాటరీతో పనిజేసే ట్రాన్సిస్టరు రైతులు వాడవలసిన ఎరువులను గూర్చి ప్రసంగిస్తున్నది....

అరటాకు కట్టలతో ఇంటిముఖం పట్టిన రైతులు.

దుమ్ము రేపుకుంటూ ఆవూరి బస్సు నైటు హాల్టుకై గంగరావి చెట్టు కిందికి చేరింది-

సర్వే తోటల్లో మిణుగురులు.

ఊళ్ళో మిణుగురుల వంటి దీపాలు.

చందూ మనస్సులో గాలిలోని దీపాలవంటి ఏవో ఆశలు.

బెత్తం చేత బుచ్చుకొని ఊపుకుంటూ ఇంటిముఖం పట్టాడు. కాలికి తాటిమట్ట తగిలింది - ఒక్క తన్ను తన్నాడు.

"కోడలుపిల్లకు ఒంట్లో నలతగా వున్నట్టుంది పిన్నీ"

సరస్వతమ్మ గొంతు -

"అవును-" ప్రసూనమ్మ కంఠం.

చందూ పోల్చుకున్నాడు.

గుడిలో కథా కాలక్షేపానికై వెళ్తున్నట్లున్నారు.

"ఏమన్నా విశేషమా?..."

"అనే అనుకుంటున్నాను."

సరస్వతమ్మ తృప్తిగా నవ్వింది.

"అయితే మళ్ళీ మా చంద్రన్నయ్యగారు రాబోతున్నారన్నమాట...."

చందూ అలాగే నిలబడిపోయాడు క్షణం! తనకీ విషయం తెలియదే-సావిత్రి మాటమాత్రమైనా అనలేదు.... చకచకా ఇంటివైపుకు నడిచాడు.

సావిత్రి దీపంబుడ్డి దగ్గర కూర్చొని ఏదో పుస్తకం పుటలు తిప్పుతున్నది "ఏమండీ.... ఈ సినిమా బొమ్మల పుస్తకం చూడండి. మాసపత్రిక, రెడ్డిగారి అమ్మాయి ఒంగోలునుండి వస్తూ తెచ్చింది."

"ఊఁ-" నులకమంచంపై కూలబడ్డాడు.

"అబ్బ ఎంత బాగున్నాయో బొమ్మలు - ఇవిచూస్తే వెళ్ళి ఈ సినిమాలన్నీ చూచి రావాలని బుద్ధిపుడుతున్నదండీ."

"ఉఁ-"

"ఇదిగో ఈ సినీతార మెళ్ళో వున్న చంద్రహార మొకసారి చూడండీ. వళ్ల పులిసిపోతున్నాయి చూస్తుంటే - ఏమండోయ్ ఈ బొమ్మనొకసారి చూడండి మీరు."

గాలికి బలహీనంగా చెట్టుకొమ్మలు కదిలాయి -

"ఏమిటలా ఆలోచిస్తున్నారు?"

"అబ్బే ఏమీలేదే."

"ఈ బొమ్మ చూడరూ అయితే-"

"చూచాను సావిత్రీ ఇంతకుముందే - అది క్యాలెండరు కింద రిలీజ్ చేశారుకూడా - రేపు ఒంగోలు పోయేవాళ్లెవరైనా వుంటే ఫాన్సీ షాపునుంచి ఆ కాలెండరు తెప్పించి నీకిస్తాలే."